"ఆరిక కూడు"

శ్రీ పులికంటి కృష్ణారెడ్డి

‘అరచేతంత అస్సాంను అయిదు రాష్ట్రాలుగా విభజించినపుడు అరటాకంత ఆంధ్రదేశాన్ని రెండుగా చీల్చితేమాత్రం మునిగిపోయేదేముంది?'— అని ఉన్నట్టుండి శ్రీమతి ఇందిరాగాంధి ఈ మధ్య మధ్యంతరం ఎన్నికల ప్రకటన చేసినట్లు ప్రకటించిందని వింటేగూడ అంత ఆశ్చర్యపడేవాడినికాను! కానీ ఆ మాటలు నా చెవుల్లో పడ్డప్పుడు కాలు నిలదొక్కుకొని నిలబడలేకపోయాను.

పనిగట్టుకొని పెంచిన పూలతోట అందంగా వుంది. అంతకంటె అందంగా వుంది ఆవరణలో మేడ! మరొకప్పుడైతే ఆ ప్రశాంతావరణము, గాలితో మేలమాడుతున్న పూ బాలలు...గుండె పరవశించి పోయేదేమో? కానీ ఓరగా మూసిన తలుపుసందున నుండి దూసుకొని వచ్చిన మాటలుమాత్రం నన్ను హడలగొట్టాయి—అక్కడ కుక్కలు ఘూర్కాలు లేకపోయినా!

ఆశ్చర్యంలో మునిగి అడుగు అటు యిటు కదల్చలేకపోయాను. ముందడుగు వేయువాడు మొనగాడు. వెనుకంజ వేయువాడు పిరికివాడు. అటో యిటో తేల్చుకోగలిగేది మొనగాడే! నీళ్ల నములుతూ నిలబడేది పిరికివాడు. అసలు పిరికి వానికే బోలెడన్ని ఆలోచనలు. అప్పటికే నేను ఆ యింటి ఆవరణదాటి వీధినపడి నడుస్తున్నానంటే—నే నెవరో మీకు తెలుసు!

నడుస్తున్నాను. నడుస్తూ ఆలోచిస్తున్నాను. ఆలోచిస్తూ అడ్డమైన వాళ్లమీద పడినట్లుపడి తప్పుకొంటున్నాను. ‘బిడ్డ తప్ప తాగినట్లుందే! అన్న మాటలు వినడం తప్పుకోలేక పోతున్నాను. ఆలోచనల నుండి తెప్పరిల్లుకోలేకపోతున్నాను. ‘మనిషి చాల మట్టుకు, డబ్బును కాలాన్ని చాల జాగ్రత్తగా వాడుకొంటాడు'—అని బుజావు పరచుకోవడానికి ఆ స్థితిలో కూడ ‘రైలు సౌకర్యమా? మోటారుమేలా? ఏది ముందు వెడుతుంది? ఎందులో పదిపైసలు తక్కువ?' అని వివరాలు అడిగి తెలుసుకొంటున్నాను. ఆంధ్రదేశంలో కరువో, కాఃమో అని బస్సు చార్జీలు విపరీతంగా పెంచారని, ఒళ్ల గుల్లకాకుండా కొంప చేరాలంటే రైలేమేలని—బాటప్రక్కన మసాలావడలు అమ్ముకొనే ముసలిది చెప్పింది. కమ్మని మసాలా వడలాంటి కమ్మని మాట చెప్పింది. అంతమంచి సలహాకు కృతజ్ఞత తెలుపలేదని జగడ మాడడానికి పాపం! ఆ పాతకాలపు ముసలిదానికి తెలియదు. బదులుగా రెండు వడలు కొనుక్కున్నాను, ఆలోచనమేతగా ఉపకరిస్తాయని.

రైలు సిద్ధంగా వుంది. నా కోసమే వేచి ఉన్నట్లుంది. పై చిల్లర డబ్బుగతి పరమాత్ముడెరుగునని టిక్కట్టు చేతికందడమే తరువాయిగా ఒక్క అడుగులో బండిలో పడ్డాను. బండి బయలుదేరింది. ప్లాట్ ఫారంమీద అయిదు నిముషాల అందమైన జాతర జరిపి; ఆ అయిదు నిముషాల జాతరలో కొందరిని యేడిపించి, మరి కొందరిని నవ్వించి సుఖదుఃఖాలకు, మోదఖేదాలకు అతీతుడైన వేదాంతిలా బిగ్గరగా నిట్టూర్చి రైలు బయలుదేరింది.

చేతిలో కమ్మని మసాలా వడలు...మనసులో తొలిచే ఆలోచనలు...ప్రజాసామ్యానికి ప్రతీకగా నిలబడివున్న ఆ మూడవ తరగతి రైలు పెట్టెలో అర్థంకాని రంపు...నిర్లక్ష్యంగా పరుగులుతీస్తూ వుంది రైలు. అందమైన ఆ యింటిముందు నిలబడ్డ రెండు నిముషాల్లో చెవుల్లోపడ్డ మాటలు మాత్రం తీపులు దీస్తున్నాయి! ‘ఛీ ఛీ! ఎంత బుద్ధిహీనంగా ప్రవర్తించావు లక్ష్మీ!...ఆ ఉత్తరాన్ని చూచి వాడెంత కంగారుపడిపోయాడో?...ఏమంత కొంపలు మునిగిందని అలా రాశావ్? పాపం!...ఈ పాటికి వాడుకన్న తిప్పలు పడివస్తుంటాడు.'—రావడమేమిటి? వచ్చి వాకిట నిలబడి ఆ మాటలు వింటున్న సంగతి వాళ్లకు తెలియదు.

'వస్తే రానీయండి చెబుతాను. నేనేగదు— నాలాంటి ఆడది ఎవరైనా సరే! చిటికెడు విషం చింతలేకుండామింగి గుటుక్కుమంటుందికానీ, యిది సహిస్తుందేమో అడిగి చూడండి.'

'ఇంతకూ నేనేం చేశానని?'

'అబ్బ! పోనీలెద్దూ!! యింకనూ ఆ పాడు మాట లెందుకు? అదొక పీడకల. వదిలిపెట్టండి.'

'ఆవేశంతోకూడిన ఆలోచనలకు, ఆలోచనతో కూడిన ఆవేశానికి సామ్యం చూద్దామని!'

'మీ కవిత్వానికి సమాధానం చెప్పలేను కానీ పదిరోజులు నేను యింట్లో లేకపోయేసరికి పనిమనిషి కాటుక డబ్బా, కుంకుమ బరిణె, చేతిరుమాలు యింట్లో కనుపిస్తాయా? అదివంట మనిషో, యింటి మనిషో అర్థంకాక నా వళ్లు కంపరమెత్తింది. ఆ ఆవేశంలో నేనేం చేశానో నాకే తెలియదు. ఇంతకూ నిజం తెలియకుండా వుంటేనా?'

'ఉంటే యేంచేసే దానివో?'

'బోడి ఆడది యేం జేస్తుందండీ! చచ్చి వూరకుంటుంది.'

'ఆఁ! అలాగా!!'

ఆ పైన కిలకిలా నవ్వులు. చిలుకా గోరు వంకా కలిసి నవ్విన నవ్వులు! ఆ ప్రశాంత వాతావరణంలో నన్ను కలవరపెట్టడానికి నా మీద రువ్విన నవ్వులు!...

రైలు పోతూనే ఉంది. ఆ మాటలు, నవ్వులు కలిసి నా చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. ఆలోచనలు రైలుతో పోటీ పడుతున్నాయి. అయితే రైలులాగ ముందుకుమాత్రం కాదు; వెనక్కు!...

చిట్టిబాబు, నేను, విజయలక్ష్మి ఒక తరగతిలో చదువుకొంటున్న రోజులవి. ఒక తరగతిలో చదువుకొంటున్నా ఒక తరగతికి చెందిన వాళ్లం మాత్రం కాదు. విద్యా విషయకంగా ప్రజాస్వామ్యం సాధించిన ప్రగతి యిది. విజయలక్ష్మిది సంపన్న కుటుంబము. సంపన్న కుటుంబములో పుట్టిన సంపెగ ఆమె! నేను మధ్య తరగతి వాడిని. చిట్టిబాబుమాత్రం కట్టకడపటి వాడు. అయితే తరగతిలో మొట్టమొదటి వాడు. దరిద్రుణ్ణి దూరంగా వుంచడం లోక సహజం. లోకంలోని దరిద్ర నారాయణ సంఘానికి వెరచి ఏడు కొండలవాడే ఏడుకొండల కవతల చేరాడట. కానీ చిట్టిబాబు చుట్టూ చాలమంది చేరేవారు.

ఓ నాటి ఉదయం నోట్లో పచ్చి మంచినీళ్లు కూడ పోయకముందే చిట్టిబాబు ఓ ప్రకటన చేశాడు. ఆ ప్రకటనతో నేను యేడవాలో నవ్వాలో తెలియ లేదు. చేష్టలుడిగి చిట్టిబాబును తదేకంగా చూస్తూ నిలబడిపోయాను. చిట్టిబాబు!...ఓ పూట అంత తాడి మరో పూట కాసిని మంచి నీళ్లు ఫలహారంతో పూట గడిపే చిట్టిబాబు...ఉన్న రెండే రెండు జతల బట్టలను రాత్రి పూట మార్చి మార్చి ఉదుక్కొని చెంబు యిస్త్రీ చేయడానికి చెంబుకోసం పక్కింటి పిల వానితో స్నేహాన్ని పెంచుకొన్న చిట్టిబాబు...కాలేజీ ఆవరణలో వంచిన తలను పైకెత్తకుండా నడుస్తూ...గది వదల కుండా పుస్తకాల పురుగై మార్కులు ప్రోగుచేసు కొంటూ...'అబ్బ! ఎంత బుద్ధిమంతుడ'ని పేరు దెచ్చుకొన్న చిట్టిబాబు...ప్రేమిస్తున్నాడట!...నక్క ఊళవేసింది. నాకలోకం ఊహాపథంలో మెదిలింది. మహాగజేంద్రము మార్గమ్మున హుందాగా నడచింది. దోమ కనులముందు గిరికీలు కొట్టింది. భేదం కొట్ట వచ్చినట్లు కనుపించింది. అందుకే అడిగాను—

'నీవు చేస్తున్న పనియేమిటో నీకు తెలుసా?' అని.

'నేనామెను ప్రేమిస్తున్నాను. అంతే!' అన్నాడు చాల తేలికగా. నాకు కడుపుబ్బ నవ్వుతోపాటు అరి కాలి మంట నెత్తికెక్కింది. అసూయతోమాత్రం కాదు. వీడి బ్రదుకంతా ఆమె చెప్పులకైనా సరి పోవునా? అన్న సందేహంతో.

'అది సరే బాబూ! ప్రేమించడం చాల తేలిక. ఈ కాలంలో అది గురువులేని విద్యకూడ. ఎందుకంటే రాస్తున్న నవలలన్నీ, తీస్తున్న సినిమాలన్నీ—ప్రేమ పాఠాల్ని నేర్పడమే పనిగా పెట్టుకున్నాయి గనుక. పోనీ! ఆమె నిన్ను ప్రేమించిందా?' అని అడిగాను.

'ఆమె ప్రేమిస్తే నాకేం? ప్రేమించకపోతే నాకేం? నేను ప్రేమిస్తున్నాను. అది నా తృప్తి!'— అంటూ అదో రకంగా చూశాడు నా కొత్త బోడి గుండువైపు. ఆ ముందు ముందు రోజే నేను వేంక

ేశ్వరుని సన్నిధానములో తలనీలాలు తీయించు కొన్నాను.' కాలేజీ గోడల్లో నీడ చూచుకొంటూ దినానికి నాలుగుసార్లు నాజెంగా దువ్వుకొంటూ వుంటివే నీ ముద్దు ముద్దుల క్రాపును. ఈ నాడు సుద్దంగా కొటి పారేశావే! పోనీ! నీవు అంతభక్తిగా పూజించిన దేవుడు నీతో మాట్లాడాడా? కోరిన వరా లిచ్చాడా? మరెందుకు అలా చేశావంటే—అదీ నీ నమ్మకం! కదూ!!' అని గుచ్చి గుచ్చి అడిగినట్లుంది ఆ చూపుల్లో భావం. అందుకే మాట మార్చాను.

'ఏకపక్ష ప్రభుత్వమైతే కత్తికెదురుండదు కానీ యిది ప్రేమకద నాయనా? దీనివలన యెవరికేం లాభముంటుంది?'

'ఎందుకుండదు? ఆమెను నా హృదయ సీమలో పదిలపరచుకొంటాను. చక్కని విరహ గీతికలు వ్రాసు కొంటాను. కమ్మగా పాడుకొంటాను. అది నాకా నందము.' ఆనందలహరిలో తేలిపోతూ అన్నాడు చిట్టిబాబ.

చిట్టిబాబు అద్భుతంగా కాకపోయినా ఓ మోస్త రుగా పాడుతాడని తెలుసు. విరహగీతికలు వ్రాస్తా డనిమాత్రం తెలియదు. 'అయితే వాగ్గేయకారుడవై పోయావన్నమాట!' ఎకసక్కెమాడింది వ్యంగ్యం.

చిట్టిబాబుకు కోపం వచ్చింది. కొర కొర చూశాడు నా వైపు.

'మీరంతా అనుకొంటూ వుంటారు—రచ యితలంటే దైవాంశ సంభూతులనీ, పూర్వజన్మ సంస్కారం కలవారనీ!—దైవాంశము లేదు. గాడిద గుడ్డు లేదు. అవసరం ఆలోచింప చేస్తుంది. ఆలో చనలో భావం పుడుతుంది. భావానికి అందమైన భాష పేరే కవిత్వం!' 'అలాగా!...నాకు తెలియదే?... కాస్త చూపించు తండ్రీ నీ అవసరం ఎంత పని చేయించిందో చూద్దాం!' అని అడిగాను హేళనగా.

పండ్లూడిన వాడి దవడలా పదహారు స్టాట్లు తిరిగిన తన పాతపెటెను తెరచాడు చిట్టిబాబు. అందులోనుండి అంతకంటే పాతదైన ఓ నోటు బుక్కును బయటికి తీశాడు. మాసిన పుస్తకంలో కాగితాలు బాగా నలిగి వున్నాయి. జాగ్రత్తగా పేజీలు త్రిప్పుతూ ఒక చోట ఆగి, ఒకసారి నా మొగాన్ని, మరోసారి ఆ పేజీని తదేకంగాచూచి ఆ పుస్తకం చేతిలో పెట్టాడు. చూశాను. చూడడమేం ఖర్మ? ఈ కడనుండి ఆ కడదాక జాగ్రత్తగా దృష్టి మరల్చ కుండా చదివాను. భావము భాష ఒక దానితో నొకటి పోటీపడుతూ సాగింది కవిత్వం. అది 'అవసరం' చేయించిన పనిగా తోచలేదు. ఆత్మానందంకోసం కవిత అనుకొంటే—అది అందులో వుంది. ఆశ్చర్య పడ్డాను.

అప్పటికే నేను ఒకటో అర కథలు వ్రాస్తున్న అలవాటు కలవాడిని. కాబట్టి అందరితో చనువుగ తిరిగేవాడిని. ఒకనాడు విజయలక్ష్మితో మాట్లాడుతూ వుంటే ఆమె అడిగింది 'ఏమండీ! మీరు కథలేనా రాయడం! పాటలేమీ రాయరా? అని. ఆ మాటలో చిట్టిబాబు మనసులో మెదిలాడు. అతని ప్రేమ వ్యవహారం మనసులో మెదిలింది. ఆపై అతని ప్రణయ కవిత్వం తలపును తాకింది. నాకు తెలియ కనే చిరునవ్వు నా పెదవుల పరామర్శించింది. నా నవ్వును అంగీకారంగా తీసుకొని ఆమె పాట విని పించమని పట్టుపట్టింది. పాటపాడాను. ప్రేమలో పడ్డ చిట్టిబాబు పాట పాడాను.

'అరె! మీరు పాటలుకూడ బాగా రాస్తారే!' ఆశ్చర్యాన్ని వెలిబుచ్చింది విజయలక్ష్మి.

'ఇది నా పాటకాదండీ! చిట్టిబాబు పాట!'

'నిజంగానా? చిట్టిబాబు పాటలుకూడ రాస్తాడా?'

'రాయడమేగాదు చక్కగా పాడుతాడుకూడా:'

'ఏదో పుస్తకాల పురుగనుకున్నాను. నిజంగా నాకు తెలియదే!'

కనురెప్పలు అలా అలా అల్లార్చి ముద్దు మురి పెంగా పలికింది లక్ష్మి.

'మీకు తెలియనివి యింకనూ చాలావున్నాయి.'—ధీమాగా అన్నాను, చిట్టిబాబు సాక్షాత్ ఈ విజయ లక్ష్మిని ప్రేమించడం దృష్టిలో వుంచుకొని.

'అయితే అతనిని మనింటికి ఒకసారి తీసుక రారాదూ !'

'ఒకసారేం ఖర్మ? మీరనుకొంటే వందసార్లు వస్తాడు.'

నిజంగానే వందసార్లు కాదు పదివందలసార్లు వెళ్లివుంటాడు చిట్టిబాబు ఆ పై విజయలక్ష్మి యింటికి. ఆ పదివందలసార్లలో వంద ప్రణయగీతాలు వ్రాశాడు. ఆ వంద గీతాలను విజయలక్ష్మి అందంగా అచ్చు వేయించింది. ప్రతి గీతానికి ఓ బొమ్మ గీయించింది. ఆ బొమ్మల్లో ఆడబొమ్మ తనది మగబొమ్మ చిట్టిబాబుదిగా వూహించుకొనింది. ఆ పై ఊహలకు ఊపిరిపోసి చిట్టిబాబును అమాంతంగా ప్రేమించింది. పెద్దలు కాదంటే కాదన్నారు. ఆమె అవునంటే అవునన్నది. ఒక్కగా నొక్క కూతురి ముచ్చట కాదనలేక పెద్దలు తలలు వాల్చేసరికి ఆమె కూడ తల వాల్చింది సిగ్గు బరువులో. తల వాల్చిన తరుణంలో చిట్టిబాబు గట్టిగా మూడు ముళ్లు వేశాడు. ఇంచుమించు ఆ పెళ్లికి పెద్దను నేను!

ఆ పై చిట్టిబాబు—అసలే బుద్ధిమంతుడైన చిట్టిబాబు బంగారుకు వాస నబ్బినట్లు కాగా బంగారుబాబయ్యాడు. బాగా చదివాడు మామగారి సాయంతో. బంగారంలాంటి ఉద్యోగాన్నే సంపాదించాడు. కలలు గన్న జీవితాన్ని కమ్మగా అనుభవిస్తున్నాడు. నేను నమ్మకమైన 'ఎన్జీవో' జీవితాన్ని భరిస్తున్నాను. సృష్టి చిత్ర మేమోమరి! కొందరి జీవితాలు సినిమా కథల్లాగ చిత్రవిచిత్రంగా మారిపోతూంటే — మరి కొందరి జీవితాలు ఓ గూటానికి కట్టుబడ్డ గొడ్డుల్లా ఆ గూటంచుట్టూ గిరికీలు కొడుతూనే వుంటాయి. కొందరి జీవితాలు నిత్యనూత్నంగా విచ్చి వికస్తూంటే— కొందరి జీవితాలు అలానే మోడువారిపోతున్నాయి. ఈ సమతా సాధనకు కవులు రచయితలు రాజకీయ నాయకులు ఎవరి తిప్పలు వారు పడుతున్నారు. అయినా ఒకరు ఎదగరు. మరొకరు తగ్గరు.

చదువు మమ్మల్ని ఒకచోట చేరవేస్తే జీవితం మమ్మల్ని మూలకొకరుగా విసరి పారవేసింది. దాని లక్షణమే అంత!—అయితే మాత్రం విజయలక్ష్మి చిట్టిబాబులు నన్ను మరచిపోలేదు. వాళ్ల అనుబంధానికి కారణం నేనేనని వాళ్ల భ్రమ. పెండ్లిండ్లు ఈ లోకంలో నిర్ణయింపబడినవి కావని నా నమ్మకం. నేనే వాళ్లిద్దరికీ ముడివేశానని వాళ్ల నమ్మకం. వారానికో ఓ నిడుపాటి ఉత్తరం వ్రాయడం తత్ఫలితం.

విజయలక్ష్మి ఉత్తరం వ్రాస్తుంది. ఆమె ఎప్పుడు వ్రాసినా కవరే వ్రాస్తుంది. అదికూడ యెడమ వైపున చక్కని ఖాళీ స్థలాన్ని వదలి ముద్దుపెట్టుకొందామన్నంత ముచ్చటగా వ్రాస్తుంది. తీరా ఉత్తరం పూర్తిచేసేటప్పటికి అది అటు తిరిగి, యిటు తిరిగి, సూచనలు షరాలతోనిండి, 'అయ్యో! యిక కాస్తజాగా వుండివుంటే!' అన్న కొదువను మిగిల్చి పూర్తి అవుతుంది. ఆ ఉత్తరం నా టేబిలు మీద కనబడ్డప్పుడు ఆ రోజంతా పండుగే! ఆ రోజు ప్రభుత్వం యిస్తున్న జీతం దండుగే!

అలాంటి విజయలక్ష్మి కార్డు వ్రాసింది. ఒక్కటంటే ఒక్క వాక్యంతో కార్డు వ్రాసింది. రాజా! నువ్వు రెక్కలు గట్టుకొని యిక్కడ వాలకపోతే నా జీవితమేమవుతుందో నాకే తెలియదు! అన్న ఒక్కటే వాక్యంతో కార్డు పూర్తి చేసింది. రెక్కలు గట్టుకొని కాకపోయినా, ముప్పు తిప్పలుపడి మా మేనేజరు మిడిగుడ్లు, మూతి విరుపులు, మెడవిరుపులు కిక్కురుమనకుండా భరించి మూడు రోజులు సెలవు సంపాదించి పుట్టి మునిగినట్టు పరుగెత్తి యింట్లో అడుగుపెట్టబోతే అడుగు ముందుకు కదలలేదు. నిలబడి విన్నాను. నవ్వాలో యేడవాలో తెలియలేదు. వాళ్ల వాదనలద్వారా తేలిన సారాంశమేమిటంటే?— అమ్మగారు పదిరోజులు ఊళ్లో లేకపోయారట! అయ్యగారు యింట్లో ఒంటరివాడేనట! ఒంటరి అయ్యగారికి తోడు వంట మనిషి. ఆ వంట మనిషి కాటుక డబ్బా, కుంకుమ బరిణె, చేతిరుమాలు యింట్లో అమ్మగారు అడుగుపెట్టేసరికి కనుపించాయట. కంపెరవెత్తి, కాలుగీరి, ఖణిల్లన అంకె వేసిందట—గోమాతలాంటి భారతనారి! మగధీరుడు మాత్రం సామాన్యుడా? అతడుకూడ సై అంటే సై అని వుంటాడు. అదృష్టవశాత్తు ఎలాగో నిజం తెలిసిపోయింది. చెలరేగిన స్పర్ధ పులిసిపోయింది. ఆ నిజం ఎలా తెలిసిందో తెలుసుకొనే అవకాశం నాకు లేకపోయింది. దాంతో నిమిత్తం కూడ నాకు లేదు. వాళ్ల జీవన స్రవంతి సాఫీగా సాగిపోవడమే నే నెప్పుడూ కోరేది.

వాళ్లఅన్యోన్య దాంపత్యము,...కలిగిన చిన్న అంతరాయము...అంత చిన్నసంగతి ముందు వాళ్ల యేళ్ల తరబడిగ సాధించిన పరస్పరావగాహన వీగిపోవ డము...వాళ్లు రేగిపోవడమూ...అంతా చిత్రంగా కనుపి స్తూంటే ఆలోచిస్తూ కూర్చున్నాను. రైలు అక్కడ డక్కడ ఆగుతూ సాగుతూ పోతూనే వుంది.

'ఏఁవిటిది?' రైలు శబ్దాన్ని మించిన గద్దింపు చెవిని పడింది.

ఆలోచనలను అటకెక్కించి చూద్దును గదా! ఎదుటు సీట్లో...అల్లంతనవ్వులో ఒకావిడ! ఎడమ చేతిలో సగం తెరచిన పెట్టెను పట్టుకొనివుంది. కుడి చేతిలో ఓ కొత్తచీర వుంది. సగం తెరచిన పెట్టె నుండి చల్లగ సంగ్రహించిన బిస్కట్‌పొట్లంతో యిద్దరు పిల్లలు రాజీ పడుతున్నారు. ఆమె, ఆమె భర్తలాంటి మగవాడు చీరతో పోటీ పడుతున్నారు.

'ఎందుకండీ అట్లా గుడ్లు మిటకరిస్తారు? వినిపించలా?...అడుగుతున్నది మిమ్మల్నే!'

'చెల్లాయికి...' నీళ్లు నములుతున్నాడతడు.

'సంతోషించాం! ప్రియఃరాలి కనలేకపోయారూ? మారు కట్టుకోడానికి చీరలేక మగ్గిపోతున్నా, ఒక్క చీరపేలికకోసం వందసార్లు మొత్తుకొన్నా చెవిని పడదు. ఆ పిల్ల వాళ్లని చూడండి, కొడుకులని చెప్ప కోడానికే సిగ్గేస్తుంది. అయినా చెల్లాయట!... చెల్లాయ్!!...హుఁ! ఇంతకూ ఒకరినని యేం ప్రయో జనం? నా రాత సరిగ్గా రాసి యేడ్చివుంటే నేనీ యేడు పులు యేడవవలసి వచ్చేదిగాదు!'

అది రైలుపెట్టె అని ఆమె మఁరచిపోయింది. తమ చుట్టూ తమ సంగతి మరచి చెవులు రిక్కించే మానవజాతి వుందని ఆమె మరచిపోయింది. తన ధోరణి తనదిగా వుంది. అంతవరకు నిందితుడై ఆమె వైపే తదేకంగా చూస్తూవుండిన మగధీరుని చూపులు అటు యిటూ మళ్లాయి. కొందరు ఆశ్చర్యంగా చూస్తున్నారు. సన్నగా కొందరు కళ్లతో మరికొందరు బిగ్గరగా పళ్లతో నవ్వుతున్నారు. అరికాలికింద రైలు చక్రాలమీది మంట ఆ మగరాయుడి నెత్తికెక్కింది.

'ఆ బ్రహ్మగాడికి బుద్ధిలేక రాస్తే రాశాడు గానీ, వాడికి బుద్ధిలేదని గ్రహించిన నీబుద్ధి మాత్రం చాల గొప్పది. నాతో యిలా వుండి నువ్వేడుస్తూ నన్నేడిపించడ మెందుకూ? నవ్వుతూ, నవ్విస్తూ ఎక్కడ హాయిగా వుంటావో అక్కడికే వెళ్లిపోరాదూ! ఒక్కనాటితో పీడ విరగడవుతుంది!'

'ఆఁ! అలాగా!!...అ పైన యెవతెనో దారిన పొయ్యే దానిని తెచ్చిపెట్టుకొని కులుకుదామనా?... ఛీ ఛీ! సిగ్గులేకపోతే సరి!...' అంటూ ఆమె చూపు మరల్చింది. అప్పటికది రైలుపెట్టెఅని గ్రహించి నట్లుంది. ముఖం క్షణక్షణానికి రంగులు మారింది. కండ్లు నిండుకొన్నాయి. అభిమానం చూపిన పెగ్గె అది!

'రండి! మీ చేతులతోనే గబుక్కున కింద తోసేయండి. పడిచస్తాను. మీ రన్నట్లు ఒక్క నాటితో పీడ విరగడై పోతుంది!'—

ఆమె అతని చేతినిబట్టి లాగుతూ వుంది. పెనగులాటలో పైట జారింది. తలలో వువ్వులు జారాయి. రైలు పెట్టెలో నవ్వులు చెలరేగాయి. ఏదీ గమనించని స్థితిలో ఆమె వెక్కివెక్కి యేడుస్తూ వుంది. ఇద్దరు పిల్లలు బిస్కట్ పొట్లాన్ని వదలి పెట్టి తల్లినిచుట్టు కొన్నారు. కసుగందుల యేడ్పులు ఈ కమ్మని దృశ్యానికి రంగులు పులుముతున్నాయి. 'చేయి వదలుతావా? లేదా?'—అంటూ చేయి పైకెత్తుతున్నాడు తాళిగట్టిన ధీరుడు.

'ఛీ ఛీ! మీకేమన్నా బుద్ధుందా లేదా? ఇన్నేండ్లు సంసారంచేసి యిద్దరు బిడ్డల్ని కనుక్కొని యింకా కుక్కల్లాగ కాట్లాడుతున్నారే!...తోడబుట్టుకు ఒక చీరతీసిస్తే నీ యబ్బ గంటేఁవి పొయ్యింది. మీ అన్న నీ కొక చీరతెస్తే మీ వదిన వాడినలా అడిగితే నువ్వేమంటావు?...పోనీ! ఆడది...అడిగితే అడిగింది... దాని బుద్ధే అంత...దానికి చెయ్యి చేసుకుంటావే?... చాలుగాని కుచ్చోండి!'—ఓ పండు ముత్తయిదువ నిండు హృదయంలో యిద్దరినీ గదమాయించింది. నాలాంటి ఒకరిద్దరు ఆశ్చర్యంగా ఆమెవైపు చూస్తే

'ఏఁవుందిలే నాయనా! ఆలూ మగల కొట్లాట ఆరిక కూడు వుడికేదాక!' అని సమాధానపరచింది. అంత తేలికగా ఆమె సమాధానపడ గలిగింది కానీ, నా సందేహం నాది. ఆ దృశ్యం నా కనులముందు మెదిలే సరికి—యిక జన్మలో వాళ్ళ ఒకరి మొగ మొకరు చూచుకోలేరన్న సందేహం కలుగుతూ వుంది. వెంటనే చిట్టిబాబు సంసారం చిందులేస్తూ ముందు కన బడింది. మనసు గందరగోళంగా వుంది. రైలు పరుగిడుతూనే వుంది. నా మనసు శూన్యాన్ని చూస్తూ ఈ సమస్యా పూరణకు ప్రాకులాడుతూ వుంది.

ఎంత సేపు గడచిందో తెలియదు. బాగా ప్రొద్దుపోయినట్లుంది. రైలు ఓ స్టేషనులో ఆగింది. విద్యుత్కాంతులలో 'ప్లాట్‌ఫారం' వింత కాంతు లీనుతూ వుంది. ఇంతవరకు కీచులాడు కొంటున్న ఆలుమగలు ఆ స్టేషనులో దిగడానికి సామానులు సర్దుకొంటున్నారు, ఆదరాబాదరా. ప్లాట్ ఫారం బాగా రద్దీగా వుంది. బండీ ఆగీ ఆగకముందే ఎక్కేవాళ్ళ, దిగేవాళ్ళ తోచులాడుక చస్తున్నారు. ఆ తోచులాటలో కాలు, చేయి యేదో ఒకటి తప్పక పోగొట్టుకొంటారేమో అన్న భావన బయట నిలబడి చూస్తున్న వాళ్ళకు కలుగుతూవుంది. ఎక్కేవాళ్ళ దిగేవాళ్ళకు, దిగేవాళ్ళ ఎక్కేవాళ్ళకు నిదానాన్ని గురించి పాఠాలు చెప్పడానికి ప్రయత్నిస్తున్నారు. చెబుతున్న పాఠాలను పెడచెవిని పెడుతున్న నేటి విద్యార్థిలా, ఆ తోచులాటలో యిరుక్కొన్నాడు యింతవరకు భార్యతో యుద్ధానికి తలపడిన మగధీరుడు. మనిషి గోగుదంటులా సన్నగా వుంటాడు. ఆ తోచులాటలో ఆయాస పడుతున్నాడు. ఆయాస పడుతూ అదో రకంగా దగ్గుతున్నాడు. దగ్గుతూ దిగలేక నలిగి పోతున్నాడు. ఆ మానవుడి సతీమణి మథన పడిపోతూ వుంది. 'అబ్బబ్బ! యేం పాడుగుంపో? రీతీ రివాజు లేదు. వీళ్ళకంటే గొఱెగుంపు మేలు!' అని వాపోతూ వుంది. 'నిదానంగా యెక్కిదిగితే 'విూ అబ్బగంటేం పోతుంది?' అని అందరిని మందలిస్తూ జాగ్రత్తగ దిగమని భర్తను హెచ్చరిస్తూ వుంది.

అతడు దిగాడు. ఆమె చెప్పినట్లు జాగ్రత్తగానే దిగాడు. ఆ పై యిద్దరు పిల్లలను దించుకొన్నాడు. ఆమె చేతిని పట్టుకొని మెల్లగా దిగమని హెచ్చరిస్తున్నాడు. ఎవరి తొందరలో వారుంటే—'ఆడమనిషి దిగటం తెలియడంలేదూ?' అని అందరి పైన గుడ్లురుముతున్నాడు. ప్లాట్‌ఫారం కాస్త యెత్తున కట్టినవాళ్ళని నిందిస్తున్నాడు. నా ఆశ్చర్యానికి అవధులు లేవు. గంటకు పూర్వం, ఈ పెద్ద మనిషి, 'ఫో! ఎవడితో నీకిష్టమైతే వాడితో ఫో! పీడ విరగడవుతుంది!' అని పదిమంది ముందర పబ్లిక్‌గా చాటింపుచేసిన పెద్దమనిషి—పడుతున్న ఆవేదనకు అర్థం తెలియలేదు. రైలుపెట్టెలో స్వజాతి నవ్వులు గసపోసుకొంటున్నాయి.

అంతలో యెవ్వరో ఓ పల్లెటూరి మొద్దబ్బాయి. ముద్దుగ వున్నాడు. 'అసలు సిసలైన తెలుగుజాతికి వారసుడిని నేను!—అన్న తీరుగా వున్నా యతని దుస్తులు. పండ్ల సందున టిక్కట్టు కరచి పట్టుకొన్నాడు, చేతిలో పాత సంచి ఒకటుంది. మరో చేత్తో వూడిపోతున్న గోచీని సర్దుకొంటున్నాడు. రైలు వెళ్ళిపోతుందేమో అన్న తపన వాడిది. ఏదీ గమనించే స్థితిలో లేడు. కండబట్టిన పొట్టేలులా పెట్టెలోనికి జొరబడ్డాడు. పల్లెటూరి మొద్దబ్బాయి చేయి ఆ హడావుడిలో దిగుతున్న సాధ్వికి తగిలింది. మగధీరుడు రెచ్చిపోయాడు.

'కండ్లు కనపడలా?...ఆడవాళ్ళ దిగుతున్నారన్న యింగితజ్ఞానం కూడా లేదు. ఛీఛీ! వట్టి ఫూల్స్!...'

'పొరపాటయిందయ్యా!...రైలెళ్ళిపోతిందేమోనీ తొందరపడితి! ఏఁవనుకోబోకండయ్యా!' తప్పు తెలుసుకొన్నాడు పల్లెటూరబ్బాయి. వాడి మాటల్లో తపన వుంది.

'రైలెక్కడిరా పొయ్యేది?... సుద్ద పల్లెటూరి గొఱ్ఱెలా మాట్లాడుతున్నావే?'

'నేను గొఱ్ఱెకాదయ్యో! మేకపోతు!...'

'ఆఁ!'

'మరేందయ్యా నీ యిష్టమొచ్చినట్టు నోరు పారేసుకుంటుండావు. చేసినతప్పు ఒప్పుకుణ్ణోడు

గొ ట్టవతాడు. పొరపాటయిందని చెప్పినా తెల్సుకోలేని నువ్వు గొట్టె! నీ యబ్బ గొట్టె! నీ తాత గొట్టె!!'

రైలుపెట్టె విరుచుకుపడి నవ్వింది.

'ఎవరితోనో నవ్వుతూ నవ్విస్తూ హాయిగా వుండు! ఫో!!' అని గంటక్రితం ధారాళంగా పర్మిషన్ యిచ్చిన పెద్దమనిషి పొరపాటుగ పరపురుషుని చేయి తగలడాన్ని సహించలేకపోవడం నా మెదడులో మరిన్ని ఆలోచనల్ని పులిమింది. గార్డు చేతిలో పచ్చదీపము తలమీద మూరెడు పైకిలేచి శోభాయమానంగా వెలుగుతున్న విద్యుద్దీపాలను 'చూడు నా దెబ్బ!' అని సవాలుచేసినట్లు అటు యిటు ఊగిసలాడేసరికి రైలు బయలుదేరింది.

కొన్ని ఆలోచనలను, అనుభూతులను వదలి పెట్టి మరికొన్ని కొత్త ఆలోచనలను, అనుభూతులను మోసికొని రైలు బయలుదేరింది.

విజయలక్ష్మి చిట్టిబాబుల సంసారం కనుల ముందు కదిలింది.

రైలుపెట్టెలో కీచులాట కిచకిచ నవ్వింది.

ఈ అనుభవం నా ఆలోచనలను ఓ అందమైన ముడివేయడానికి ఆతురతపడుతూ వుంది.

'రైలు ఒక సంసారము. రెండు రైలుపట్టాలు ఆలుమగలు. రైల్వే స్టేషన్లు ఆలుమగలమధ్య జగడాలు...రైలు గమ్యస్థానం చేరుతుంది. ఆలు మగలనబడే రెండు పట్టాలమీద సంసారమనబడే రైలు.. జగడాలనే స్టేషనలో ఆగుతూ ఆగుతూ గమ్యస్థానం చేరుతుంది!'

అనుభవం నేర్పిన పాఠం యిది! నాతో నేను నవ్వుకొన్నాను. నవ్వుతూ ఆ పండు ముత్తయిదువ వైపు చూశాను. ఆమెకూడా నవ్వుతూ వుంది. అది నవ్వుగాదు. ఆ తల్లి జీవితానుభవాల తోరణంలో అరివిరిసిన పువ్వు!' నాయనా! ఆలూ మగల కొట్లాటెంత సేపు?...ఆరికకూడు ఉడికేదాక!' అన్నట్లుందా నవ్వు!

రైలు పోతూనే వుంది!

నా తత్త్వం

శ్రీ నూతలపాటి గంగాధరం

నాకు వెనక్కి నడవటం రాదు,
అప్పు డప్పుడూ తిరిగి చూడటం తప్ప!
ఎందుకంటే నా శరీర నిర్మాణం కూడా
ముందు నడకకే సిద్ధంగా ఉంది.

వెడుతూ వెడుతూ వెనక చప్పుడైనప్పుడు
తిరిగి చూస్తాను,
—దారి సరైనదా కాదా,
—దారి మార్చవలసిన అవసరం ఏర్పడిందా,
—నడుస్తున్న నా నడతలో
కొత్తదనం, గొప్పదనం ఉందా లేదా,
అని తెలుసుకోవడానికి!

నాదెప్పుడూ ముందు చూపే!
నా కళ్లు ముందే ఉన్నాయి కాబట్టి!
కొందరి కళ్లు వెనకే ఉంటాయి

అది ప్రకృతి విరుద్ధం కదా మరి—
అని ఏం చెప్పినా వాళ్ల చూపు
వెనక్కే వెడుతుంది

వెనక్కి నడవడం కూడా
పెద్ద ప్రతిభ అనుకునేవాళ్లున్నారు
గారడీవాడు కూడా నడుస్తుంటాడు—
వీధిలో అంగడి పెట్టినప్పుడు!
అదే బ్రతుక్కి పరమార్థ మనుకుంటే ఎలా?

జరిగిపోయింది ఎంత ఘోరమైనా
ఒక కథలాగా నిశ్చింతగా వినడం,
జరగబోయేది ఎంత చిన్నదైనా
సంచలించి—సన్నద్ధమవడం—
ఇదీ నా తత్త్వం!